ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 7 మే 2025



అవినీతి వైద్యాధికారి సస్పెన్షన్

ముళబాగిలు, మే 6 (ఆంధ్రజ్యోతి): ముళబాగిలు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పాలనా వైద్యాధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ కేఎస్ సురేంద్ర కుమార్‌ను ఉన్నతాధికారుల సస్పెండ్ చేశారు. అవినీతి ఆరోపణల ఫిర్యాదు మేరకు జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి నివేదిక సమర్పించారు. ఈ మేరకు సస్పెడ్ చేస్తూ ప్రభుత్వ అదనపు కార్యదర్శి బీఎస్ ప్రదీప్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు వైద్య సేవలందించాల్సిన వైద్యులు అవినీతికి పాల్పడడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గని కార్యాలెన్నెన్నో..!





- అడ్డగోలు మైనింగ్.. రూ.వేల కోట్లకు పడగ
- సరిహద్దులు మార్చేశారు.. సుంకులమ్మ గుడి కూల్చేశారు
- సీబీఐ తీర్పుతో ఖంగుతిన్న గాలి అండ్ బ్యాచ్
- ఎంతోమంది అధికారులు, మైనింగ్ ఓనర్లు బలి

అక్రమ మైనింగ్‌లో రూ.వేల కోట్లు దోచుకున్న గాలి ఘన కార్యాలు ఎన్నెన్నో ఉన్నాయి. గతంలో ఎన్నో ఏళ్లు నిత్యం వార్తల్లో ఉండే గాలి అక్రమాలు ఇప్పుడిప్పుడే జనం మరిచి పోతున్నారు. అయితే సీబీఐ తీర్పుతో గాలి అక్రమాలపై చర్చ జోరందుకుంది.

- బళ్లారి, ఆంధ్రజ్యోతి

ఓఎంసీ ముసుగులో..

ఓబుళాపురం మైనింగ్ కంపెనీల ముసుగులో రూ. వేల కోట్ల ప్రజాధనం లూటీ జరిగింది. 1997 వరకూ ఎన్నొబిల్ ఇండియా అనే ఒక చిట్‌ఫండ్ కంపెనీతో జీవితం ప్రారంభించిన గాలి జనార్దన్‌రెడ్డి కేవలం ఏడెనిమిదేళ్లకు రూ. వేల కోట్లకు పడగలెత్తాడు. 2004లో ఏపీలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లోనే గాలి ఇనుప గనుల లీజుకు దక్కించుకున్నారు. అక్కడి నుంచే అసలు లూటీ ప్రారంభమయ్యింది. 2006 మధ్యలో ఐరన్ ఓర్‌కు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. చైనాలో ఒలింపిక్స్ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఇనుము ముడి ఇనుప ఖనిజం అవసరం పెరిగింది. దీంతో ఎగుమతి కాంట్రాక్టు దక్కించుకున్న గాలి దశ తిరిగింది. 2004 నుంచి 2008 వరకు నాలుగేళ్ల కాలం లో ఇనుప గనుల్లో గాలి లూటీ కొనసాగింది. ఓఎంసీ-, ఓఎంసీ-1 ఓఎంసీ-2, ఓఎంసీ-3, ఏఎంసీ, పేరుతో గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీ నాలుగు మైనింగ్‌లను మొత్తం 95 హెక్టర్లలో లీజ్ హక్కులు పొందారు. బళ్లారి రిజర్వుఫారెస్టు ఏరియాలో ఉండే ఇనుప నిక్షేపాల తవ్వకాలకు వీరితో పాటు బీఐటీపీ, వైఎం, టపాల గనేష్ కంపెనీల లీజ్ ఏరియాల్లో గాలి అండ్ కంపెనీ చొరబడి లూటీ చేసింది. 2006లో ఏపీలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండడం, కర్ణాటకలో బీజేపీ లో గాలి జనార్దన్‌రెడ్డి హవా కొనసాగడం వీరికి కలిసొచ్చిన అంశం.

హద్దులు చెరిపేశారు

గనుల దోపిడీలో గాలి హద్దులు చెరిపేశారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దుల్లో గాలి ఇతర లీజు హక్కులు పొందిన ఏరియాలను దాటి తవ్వకాలు కొనసాగించారు. నో-లీజు ఏరియాల్లోనూ ఇనుప గనుల లూటీ చేశారు. 2009లో సీఎం రోశయ్య ఏపీ ముఖ్యమంత్రి అయ్యాక గనుల తవ్వకాలు నిషేధిస్తూ జీఓ జారీ చేశారు. అక్రమ మైనింగ్ పై నిగ్గు తేల్చడానికి 2011లో సుప్రీంకోర్టు సీఈసీని పంపింది. అప్పుడు సీఈసీ టీమ్ లీడర్‌గా ఏకే పాల్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ గనుల్లో సర్వే చేపట్టారు. సీఈసీ కూడా అనేక పర్యాయాలు గనుల్లో జరిగిన అక్రమాలు గుర్తించి, లీజు బౌండరీలు, అటవీ భూములపై సర్వే చేపట్టింది. 1896 టోపో సీట్ ప్రకారం సర్వే చేశారు. ఆ సర్వే ప్రకారం లీజ్ బౌండరీలకు, ఫారెస్టు బౌండలీలకు, ఎక్కడా పొంతన లేకుండా పోయింది. సర్వేలో తప్పులు దొరకూడదని అప్పటి ఫారెస్టు డీఎఫ్‌వో కల్యాల్ బిస్వాస్ గాలి జనార్దన్‌రెడ్డితో కలిసి బౌండరీ లీజులనే మార్చేశారు. వాస్తవాలు బయట పడడంతో డీఎఫ్‌వోను ప్రభుత్వం విధుల నుంచి డిస్మిస్ చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి అక్రమలకు సహకరించిన అనేక మంది అధికారులు సస్పెండ్ అయ్యారు. 2014లో జైలు నుంచి బయటకు రావడానికి ఏకంగా న్యాయాధికారితోనే డీల్ చేయడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ న్యాయాధి కారి కూడా అక్రమాల నుంచి బయట పడలేక పోయారు. ఇలా ఎందరో అధికారులు, నాయకులు, నమ్ముకున్న వారు పాపం గాలి అక్రమాలకు బలయ్యారు. ఇప్పుడూ జైలుకూ ఆయన వెంటే వెళ్లారు.

మాజీ సీఎం రోశయ్య ఆత్మకు శాంతి: టపాల గణేష్

గాలికి శిక్ష ఖరారైన తర్వాత బళ్లారిలో టపాల గణేశ్ విలేకరులతో మాట్లాడారు. గనుల్లో గాలి జనార్దన్‌రెడ్డి అక్రమాలు అరికట్టేందుకు అప్పుడు ముఖ్యమంత్రి రోశయ్య తీవ్రంగా ప్రయత్నం చేశారని, సీబీఐకి ఆయనే ఫిర్యాదు చేశారన్నారు. నాటి విచారణతోనే గాలి అక్రమాలు బయటపడ్డాయని, గాలి కి శిక్ష ఖరారుతో రోశయ్య ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నా నన్నారు. న్యాయం గెలుస్తుందనే నమ్మకం ఉండేది. ఇప్పుడు అదే జరిగిందని అన్నారు.

ఆలయాన్నీ వదల్లేదు..

గనుల్లో మేలు రకం ముడి ఖనిజం ఉందని ఏకంగా అక్కడి జనం ఆరాధ్య దేవతగా పూజించే సుంకులమ్మ ఆలయాన్ని కూడా కూల్చేశారు. ఒక చిట్ ఫండ్ కంపెనీలో ప్రారంభించి మైనింగ్‌లో అడుగులు పెట్టిన గాలి జనార్దన్‌రెడ్డి అండ్ కంపెనీ నేడు వేల కోట్ల అక్రమంగా దోచుకుని చివరకు మంగళవారం సీబీఐ కోర్టు ఇచ్చిన ఈ కేసులో ఏడేళ్ల కాలం శిక్షను అనుభవించేందుకు జైల్లోకి వెళ్లారు. గాలికి టీవీ శ్రీనివాస్‌రెడ్డి వ్యాపార నమ్మకస్తుడు, ఇతని సొంత ఊరు ప్రొద్దుటూరు. ఎం ఆలీఖాన్‌ది అనంతపురం జిల్లా గుంతకల్లు. అతను బళ్లారిలో ఇంజనీరింగ్ చదువుకునే సమయంలో శ్రీరాములు అల్లుడు మాజీ ఎమ్మెల్యే సురేషబాబు క్లాస్‌మేట్, ఎం. అలీఖాన్. సురేష్ బాబు ద్వారా గాలి జనార్దన్‌రెడ్డికి అలీఖాన్ పరిచయం ఏర్పడి ఇప్పుడ అయనకు అత్యంత ముఖ్య అనుచరుడుగా జైల్లో ఉన్నాడు. గాలి జనార్దన్‌రెడ్డి జైలుకు వెళ్లే ప్రతి సారీ ఆయనకు అలీఖాన్ వెంట ఉండడం విశేషం.

'గాలి' మాటలు నమ్మి మోసపోయామా..!

- సీబీఐ తీర్పుతో దిక్కుతోచని గంగావతి ప్రజలు



గంగావతి ఎమ్మెల్యేగా గాలి జనార్దన్‌రెడ్డి ని గెలిపించుకుని తప్పుచేశామా..? ఓటు వేసి గెలిపించే ముందే ప్రజలు ఆలోచించి ఉంటే ఈరోజు ఎమ్మెల్యే లేని నియోజక వర్గం ఉండేది కాదు కదా అన్న మీమాంస వారిలో మొదలయ్యింది. గాలి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యే ఎన్నికల ముందు కేకేఆర్‌పీ అనే సొంత పార్టీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేగా ఆయన ఆపార్టీ నుంచే గెలిచారు. ఆయన పార్టీ తరుపున రాష్ట్రంలో 150 స్థానాల్లో అభ్యర్థులు పోటీ చేస్తే గంగావతి నుంచి గాలి జనార్దన్‌రెడ్డి మాత్రమే విజయం సాధించారు. అక్కడ కాంగ్రెస్ తరుపున ఇక్బాల్ అన్సారీ, బీజేపీ నుంచి మరో అభ్యర్థి ఇద్దరూ స్థానికులే పోటీ నిలిచారు. కానీ ప్రజలు గాలినే నమ్మి ఓటేశారు. గెలిచిన తరువాత కూడా గంగావతిలో గాలి జనార్దన్‌రెడ్డికి ప్రజల్లో పెద్దగా విశ్వాసం లేకుండా పోయింది. ఏదో అక్కడికి చుట్టపు చూపుగా వెళ్లడం తప్పా ప్రజలకు ఎక్కడా సమస్యలు తీర్చిన సంఘటనలు లేవు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సరే ఏదో అప్పుడప్పుడు వచ్చి పలకరించే గాలి ఇక ఏడేళ్ల జైలుకు వెళ్లడంతో ఎమ్మెల్యే లేని నియోజకవర్గం అయిపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇక ప్రజలు సమస్యలు ఇక నుంచి ఎవరితో చెప్పాలి అని మదనపడుతున్నారు. స్థానిక నాయకులు వద్దకు వెళ్తే అప్పుడు గాలిజనార్దన్‌రెడ్డిని గెలిపించారు కదా అక్కడికే వెళ్లి సమస్యలు చెప్పుకొండి అని కోప్పడుతున్నట్లు తెలుస్తోంది.

కూతురి హత్య.. తండ్రి ప్రతీకారం

- దారి కాచి నిందితుడి తండ్రిని కడతేర్చిన వైనం

బెంగళూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లాలో టీచర్‌గా పనిచేస్తున్న ఓ యువతి హత్యకు ఆమె తండ్రి ప్రతీకార హత్య చేశారు. హత్యకేసు నిందితుడి తండ్రి నరసింహగౌడను మంగళవారం ఉదయం దారి కాచి, వెంకటేశ్ అవే వ్యక్తి చంపేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, మండ్య జిల్లా పాండవపుర తాలూకా మాణిక్యనహళ్ళికి చెందిన దీపిక 2024 జనవరిలో మేల్కోటె యోగానరసింహస్వామి ఆలయం వెనుక భాగాన హత్యకు గురయ్యింది. దీపిక ఫోన్‌లో చివరికాల్ నితీశ్‌ది ఉండడంతో, ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నితీశ్ అరెస్టు కాగా ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. నితీశ్ అక్కకు ఈనెల 11న వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి ఏర్పాట్లలో కుటుంబ సభ్యులంతా బిజీగా ఉన్నారు. దీపిక తండ్రి వెంకటేశ్ ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. నితీశ్‌తండ్రి నరసింహగౌడ గ్రామంలో ఒంటరిగా నడిచి వెళ్తుండగా ఒక్కసారిగా వెంకటేశ్ చాకుతో విచక్షణా రహితంగా పొడిచారు. నా కుమార్తెను హతమార్చి, నీ కుమార్తెకు పెళ్లి ఎలా చేస్తావో అంటూ వెంకటేశ్ దూషించినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలతో నరసింహగౌడ అక్కడికక్కడే మృతి చెందాడు. మేల్కోటె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పరారైన వెంకటేశ్‌కోసం గాలింపు చేపట్టారు. నితీశ్, దీపిక స్నేహితులుగా ఉండేవారు. దీపిక భర్తతోపాటు కుటుంబీకులు నితీశ్‌తో స్నేహం ఏంటని ప్రశ్నించేవారు. తమ్ముడిలాంటివాడని దీపిక దాటవేసేది. ఇలా కుటుంబంలో వివాదం రావడంతో కొంతకాలం వారిద్దరూ మాట్లాడుకోవడం మానేశారు. 2024 జనవరి 22న నితీశ్ బర్త్‌డే ఉండడంతో మేల్కోటె కొండ వద్ద ఇద్దరూ కలిశారు.

నితీశ్‌కు బహుమతిగా ఓ షర్టును దీపిక తీసుకెళ్లింది. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే ఆ మరుసటి రోజు ఆలయం వెనుకభాగాన దీపిక మృతదేహం బయటపడింది. దీపిక కుటుంబసభ్యులు నితీశ్‌పై ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్టు చేశారు. నరసింహగౌడ్ మృతితో నితీశ్ కుటుంబంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

10 నుంచి జ్ఞానయజ్ఞం

ముళబాగిలు, మే 6(ఆంధ్రజ్యోతి): ముళబాగిలు శివారులోని నరసింహతీర్థ పాదరాజమఠంలో పాదరాజ ఆరాధన పురస్కరించుకుని ఈనెల 10 నుంచి జూన్ 11వరకు జ్ఞానయజ్ఞం కార్యక్రమం నిర్వహించ నున్నారు. మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామిజీ మఠంలో ఆహ్వానపత్రికను విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. జ్ఞానయజ్ఞ కార్యక్రమంలో నిత్యహోమం, నిత్య శాస్త్ర ప్రవచనం, నిత్య సర్వమూల పాఠ, నిత్యదాసర కృతుల సంకీర్తన ఉంటాయన్నారు.



సుజయనిధి తీర్థస్వామీజీ

సైరన్..!

బెంగళూరు, మే 6(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తం కావడం, ప్రమాదం వేళ ప్రాణాలు కాపాడుకోవడం తదితర చర్యలపై అధికారులు అవగాహన కల్పించునున్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడి నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా బుధవారం వార్ మాక్‌డ్రిల్‌ను నిర్వహించనుంది. అధిక జనాభా ఉన్న ప్రాంతాలతో పాటు ఇస్రో, డీఆర్‌డీఓ, ఎయిర్‌బేస్, ఐటీబీటీ కంపెనీలు, కీలకమైన కట్టడాలు, ఎంఎన్‌సీ కంపెనీలు ఉన్న బెంగళూరు నగరంతోపాటు అత్యంత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కల్గిన రాయచూరులోనూ, అణు విద్యుత్‌స్థావరం కల్గిన ఉత్తరకన్నడ జిల్లా కేంద్రం కారవారను పరీక్షలకు ఎంపిక చేశారు. రాష్ట్రంలో మూడు చోట్ల మాక్‌డ్రిల్ జరపనున్నట్లు ఎస్‌డీఆర్‌ఎఫ్ చీఫ్ ప్రశాంత్‌కుమార్ ఠాకూర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యాహ్నం 4 గంటలకు డ్రిల్ కొనసాగనుందన్నారు. బెంగళూరు సిలికాన్ వ్యాలీగా పేరొందిన నగరంతోపాటు దేశంలో అత్యధిక జీడీపీతో పాటు ఐటీబీటీ సంస్థలు, అంతరిక్ష పరిశోధనాకేంద్రం ఇస్రో, యలహంక ఎయిర్‌బేస్, డీఆర్‌డీఓ వంటి సంస్థలు నగరంలో ఉన్నాయి. ఉత్తరకన్నడ జిల్లా కారవార వద్ద కాళి నది సమీపంలోని కైగా అణువిద్యుత్‌స్థావరం ఉంది. దేశంలోనే మూడో అతిపెద్ద అణువిద్యుత్‌కేంద్రంగా పేరొందింది. నౌకాయానకేంద్రం కదంబ ఉంది. రాయచూరులో థర్మల్ విద్యుత్‌కేంద్రం ఉంది. రాష్ట్రంలో విద్యుత్ 70శాతం ఇక్కడే ఉత్పత్తి కానుంది. దీంతో మాక్‌డ్రిల్‌కు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశామన్నారు. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో చోటు చేసుకునే ప్రమాదాల వేళ ప్రజలు ఏ విధంగా రక్షణ పొందాలనే రీతిలో మాక్‌డ్రిల్ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. కర్ణాటక నగరాలు 'బీ' గ్రూప్‌లోకి వస్తాయన్నారు.



మెజిస్టిక్ ఉప్పారపేట పోలీస్‌స్టేషన్‌లో అమర్చిన సైరన్

35 చోట్ల సైరన్ - 32 చోట్ల మాక్‌డ్రిల్

బెంగళూరులో 35చోట్ల సైరన్ ప్రయోగిస్తుండగా 32చోట్ల మాక్‌డ్రిల్ కొనసాగనుంది. సైరన్ ఏర్పాటు చేయడం వెనుక యుద్ధం జరిగితే ఎక్కడికక్కడ ప్రజలు అప్రమత్తం చేసేందుకు సైరన్‌ను ఉపయోగిస్తారు. ఇలా నగరవ్యాప్తంగా 35చోట్ల సైరన్ మోగించనున్నారు. 32 చోట్ల మాక్‌డ్రిల్ కొనసాగనుంది. అందులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఈఎస్ఐ ఆసుపత్రి, బెంగళూరు డెయిరీ, కెనరాబ్యాంకు, విశ్వేశ్వరయ్య టవర్‌తోపాటు కమర్షియల్ స్ట్రీట్, ఐటీపీఎల్ సహా కీలకమైన ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌లు, అగ్నిమాపకకేంద్రాల పరిసరాల్లో మాక్‌డ్రిల్ కొనసాగించనున్నారు.



రాజీవ్ గాంధీ విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్ల ప్రదానోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

గ్రామాల్లో వైద్య సేవలకు సిద్ధం కండి

- యువ డాక్టర్లకు గవర్నర్ పిలుపు
- ఘనంగా రాజీవ్ గాంధీ వైద్య విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

బెంగళూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మహానగరాలలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని గ్రామీణ ప్రాంతాలలో సేవలకు యువ డాక్టర్లు సిద్ధం కావాలని గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం 27వ స్నాతకోత్సవం మంగళవారం నిమ్హాన్స్ సభాప్రాంగణంలో జరిగింది. వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్, విప్రో సంస్థ అధినేత అజీమ్‌ప్రేమ్‌జీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. రాజీవ్‌గాంధీ వర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ బీసీ భగవాన్ మాట్లాడుతూ 63,982 మంది విద్యార్థులకు పట్టాలు పొందడం సంతోషమన్నారు. 93మంది విద్యార్థులు 109 బంగారు పతకాలు సాధించారన్నారు. పీఈఎస్ ఫార్మసీ కళాశాల విద్యార్థి డాక్టర్ బీఎస్ గిరీశ్ 6 బంగారు పతకాలు సాధించారని, ఉజిరెకు చెందిన ఎస్‌డీఎం ప్రకృతి చికిత్సాకేంద్రంలో యోగా సైన్స్ కళాశాల డాక్టర్ ధన్యశ్రీ 4 బంగారు పతకాలు పొందారన్నారు. 82మందికి పీహెచ్‌డీలు, 265మందికి సూపర్‌స్పెషాలిటీ, 8588 పీజీ, 6 స్నాతకోత్తర డిప్లమో, 615 ఫెలోషిప్ కోర్సులు, 9 సర్టిఫికెట్ కోర్సులు, 54,517మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం చేశామన్నారు. 87.49 శాతం ఫలితాలు ప్రకటించామని, గడిచిన ఐదేళ్లలో ఇదే రికార్డు అన్నారు. సెంటర్ ఫర్ హ్యూమన్ జెనెటిక్స్ కేంద్రం ముఖ్యులు డాక్టర్ హంబేగౌడ శరత్‌చంద్రకు ఈ ఏడాది శాస్త్రవేత్త పురస్కారాన్ని, ఓఎంఎఫ్ సర్జన్ డాక్టర్ గిరీశ్‌రావ్, న్యూరాలజిస్ట్ నిపుణులు డాక్టర్ జీటీ సుభాష్‌లకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశామన్నారు. రాజీవ్‌గాంధీ హెల్త్ యూనివర్సిటీ ద్వారా వచ్చే ఏడాది రామనగరలో క్యాంపస్‌ను ప్రారంభిస్తామన్నారు.

భూస్వాధీనంలో పారదర్శకత ఏదీ?

- అధికారుల చర్యలపై రైతుల నిరసన
- అన్నదాతను ముంచేస్తున్నారని బీజేపీ మండిపాటు

శిడ్లఘట్ట, మే 6(ఆంధ్రజ్యోతి): సారవంతమైన సాగు భూములను భూ స్వాధీనం చేసుకోవడానికి కేఐఏడీబీ ప్రక్రియ చేపట్టే విషయంలో రైతుల నుంచి అభిప్రాయసేకరణలో పారదర్శకంగా సాగలేదని రైతుసంఘాలు అభిప్రాయపడ్డాయి. హసిరుసేన, రైతుసంఘం, కేఐఏడీబీ భూ వ్యతిరేక పోరాట సమితి, బీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. హసిరుసేన రైతు సంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు భక్తరహళ్ళి భైరేగౌడ మాట్లాడుతూ తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, అయితే ఫ్యాక్టరీలకోసం సాగుభూములను లాక్కోవడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భూములను రైతు లు స్వచ్ఛందంగా ఇస్తేనే తీసుకోవాలన్నారు. అయితే రైతులు వ్యతిరేకిస్తున్నా మొండిగా సారవంతమైన భూములను రాష్ట్రప్రభుత్వం, జిల్లా, తాలూకా యంత్రాంగాలు ఎందుకంత ఆసక్తి చూపుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. ఏప్రిల్ 25న రైతులనుంచి అభిప్రాయ సేకరణలో వైట్, పింక్ చీటీలు ఇచ్చారని అయితే వాటికి ఎంతమంది సానుకూలం వ్యక్తం చేశారో తెలుసు కోకనే అధికారుల చాంబర్‌లో కూర్చుని గణాంకాలు ప్రకటించడం సరి కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పూర్తి స్థాయిలో పారదర్శకంగా విధానం సాగలేదన్నారు. ఆకుపచ్చ కండువా వేసుకున్నవారంతా రైతులు కాలేరని వ్యా ఖ్యానించారని, అయితే కేఐఏడీబీకి ఎందుకు వ్యతిరేకిస్తున్నారని, డీమ్డ్ ఫారెస్ట్ గురించి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయ కుడు సీకల్ రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, దళిత సంఘర్ష సమితి జిల్లా సంఘటనా సంచాలకులు ఎన్ వెంకటేశ్, కేఐఏడీబీ భూ వ్యతి రేక పోరాట సమితి అధ్యక్షుడు హిరెబల్ల కృష్ణప్ప, రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా తరలివస్తున్న రైతులు

నకిలీ బంగారం కేసులో నిందితుడి అరెస్టు

బళ్ళారి సిటీ,మే 6(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసిన కేసులో నిందితుడిని పోలీసు లు అరెస్ట్ చేశారు. సండూరు తాలూకా అంతఃపుర కాలనీలోని కొరచరహట్టి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివారెడ్డి అనే వ్యక్తిని నకిలీ బంగారం నిజమైన బంగారమని నమ్మించి రూ.10లక్షలు మోసం చేసి పారిపోయిన సంఘటన శనివారం జరగింది. కొరచరహట్టి గ్రామానికి చెందిన నిందితుడు తిరుపతి, అతని సహచరులతో కలిసి శివారెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. తమ వద్ద ఒక కిలో నిజమైన బంగారం ఉందని, దానిని రూ.40 లక్షలకు అమ్ముతామని చెప్పారు. శివారెడ్డి అతని మాట నమ్మి రూ.10లక్షలతో తోరణగల్లు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. నిందితుడు తిరుపతి అతని సహచరులు శివారెడ్డికి 125గ్రాముల నకిలీ బంగారాన్ని అందజేసి రూ. 10లక్షలు తీసుకుని వెంటనే పారిపోయారు. శివారెడ్డి బంగారాన్ని పరిశీలించనప్పుడు అది నకిలీ బంగారం అని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు తోరణగల్లు పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. తోరణగల్లు పోలీస్ స్టేషన్ వెంటనే చర్య తీసుకుని సోమవారం నిందితుడు తిరుపతిని అరెస్టు చేసి అతని నుంచి రూ.10లక్షలు స్వాదీనం చేసుకుని కోర్టు ముందు హాజరుపరిచారు. మోసపోయిన శివారెడ్డికి పోలీసులు డబ్బు తిరిగి ఇచ్చారు. నకిలీ బంగారాన్ని అమ్మిన మిగిలిన నిందితులనుగుర్తించే పని జరగుతోంది. ప్రజలు అలాంటి మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మోసాల ఉచ్చులో పడకూడదని తోరణగల్లు పోలీస్ స్టేషన్ పీఎస్ఐ డాకేశ్ సూచించారు.



ఎక్స్‌కవేటర్‌తో పైపులైన్ పనులు చేస్తున్న దృశ్యం

తీరనున్న దాహం..

రూ.11.56 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు

- 90 శాతం పూర్తి
- ఏడువేల కుటుంబాలకు ప్రయోజనం

విడపనకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు గ్రామాలకు చెందిన 7 వేల మంది దాహం తీర్చే తాగునీటి పైపులైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. మండలంలోని హావళిగి గ్రామంలోగల పంపుహౌస్ నుంచి ఆరు గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆరు గ్రామాలకు తాగునీరు సరిగా అందక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి సమస్యపై అప్పటి ప్రజాప్రతినిధులను ఖాళీ బిందెలతో నిలదీశారు. అయినా పట్టించుకున్న పాపాన పోలేదు. పయ్యావుల కేశవ్ ఎన్నికల ప్రచారంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలో నీటి సమస్య పరిష్కారానికి రూ.11.56 కోట్ల నిధులు కేటాయించారు. వెంటనే పనులు ప్రారంభించారు. 90 శాతం మేర పూర్తయ్యాయి కూడా.

బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం వద్ద హగరి నదిలో బావి తవ్వి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా మండలంలోని హావళిగి పంపుహౌస్‌కు నీరు సరఫరా చేస్తున్నారు. దాదాపు 10.5 కిలోమీటర్లు పైపులైన్ ఉంది. అక్కడి నుంచి మండలంలోని హావళిగి, కరకముక్కల, పాల్తూరు, గాజుల మల్లాపురం, చీకలగురికి, ఉండబండ గ్రామాల్లోని ఏడు వేల కుటుంబాలకు చెందిన

28వేల మందికి తీరనున్న కష్టాలు

28 వేల జనాభాకు నీరు సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా నీరు ఆయా గ్రామాల ప్రజలకు చాలట్లేదు. 24 గంటలూ మోటార్లు పెట్టి నీరు తోడినా వారినికోసారి సరఫరా మాత్రమే నీరు అందుతోంది. వేసవిలో ఆయాగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపారు. పైపులైన్ పనులకు రూ.11.56 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో బొల్లనగుడ్డం నుంచి మరో భారీ పైపులైన్ నిర్మాణం చేపట్టారు. తద్వారా హావళిగి పంపుహౌస్‌కు నీరు తీసుకొస్తారు. అక్కడి నుంచి గ్రామాలకు సరఫరా చేస్తారు. హావళిగి పంపుహౌస్ పాతది కావడంతో కొత్తది నిర్మించనున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ నీరు సరఫరా చేసేలా కొత్తగా పైపులైన్లు వేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకో 600 మీటర్లు చేయాల్సి ఉంది. అవి కూడా పూర్తయితే ఆయా గ్రామాల్లో తాగునీటికి కొరత ఉండదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పాత పైపులు



పంపుహౌస్ వద్ద సిద్ధంగా ఉన్న పైపులు

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



బొమ్మనహాళ్ మండలం బొల్లన గుడ్డం నుంచి హావళిగి గ్రామం వరకూ 10.5 కిలోమీటర్ల దూరం పైపులైన్ పనులు పూర్తిచేశాం. ఇంకో 600 మీటర్లు పెండింగ్‌లో ఉంది. అదికూడా త్వరలోనే పూర్తిచేస్తాం. దీంతో ఆరు గ్రామాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

-ముజామిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, విడపనకల్లు

ఏరియా ఆస్పత్రిలో



కాలంచెల్లిన పోవిడన్ అయోడిన్ ఆయింట్‌మెంట్ కాలంచెల్లిన ఆయింట్‌మెంట్ (వృత్తంలో ఎక్స్‌పైరీ తేదీ)



ఎక్స్‌పైర్డ్ మందులు..!

గుంతకల్లు వైద్యశాలలో రోగుల ఆరోగ్యంతో చెలగాటం



గుంతకల్లు ఏరియా ఆస్పత్రి

గుంతకల్లు, మే6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కాలంచెల్లిన మందులతో రోగుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. విషయం తెలియక ఆస్పత్రికి వచ్చే రోగులు వాటిని గుడ్డిగా తీసుకెళ్తున్నారు. ఆస్పత్రికి సరఫరా అయ్యే మందులు నెలలో కాలంచెల్లే పరిస్థితిలో ఉంటుండటంతో వాటిని వాడేలోపే గడువు తీరిపోతున్నాయి. ఆస్పత్రికి వైద్యులకు విషయం తెలిసినా నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఎక్స్‌పైరీ మందులను వాడేది లేదంటూ కట్టుకట్టే సిబ్బంది.. ఫార్మసీ స్టాకిస్టుకు తెగేసి చెబుతున్నా.. 'ఎక్స్‌టర్నల్ యూజ్ కదా.. ఏమీకాదులే' అంటూ సర్దిచెబుతున్నారట. మందుల ఎక్స్‌పైరీ వివరాలను తెలిపి వైద్యులకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సి ఉండగా, ఆ పని జరగడంలేదు. రోగులు తినాల్సిన మందులు కూడా రేపో.. మాపో ఎక్స్‌పైరీ అయ్యే స్థితిలోనే ఉంటుండటం గమనార్హం.

కాలంచెల్లి నాలుగు నెలలు..

గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి ఎక్స్‌పైరీ డేట్ దాడిన మందులు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏయే మందులు కావాలో ఇండెంటు పెడితే అనంతపురంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఆ మేరకు నెల, రెండు నెలలకు సరిపడా పంపుతారు. అలా గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి వచ్చిన మందుల్లో కొన్ని ఆయింట్‌మెంట్లు కాలంచెల్లి నాలుగు నెలలౌతోంది. వాటిని ఇంకా వాడుతూనే ఉన్నారు. రోగులకు ఇచ్చిపంపుతున్నారు. పోవిడన్ అయోడైన్ అనే ఆయింట్‌మెంట్ 2023 జనవరిలో తయారై, 2024 డిసెంబరు ఎక్స్‌పైరీ తేదీ కలిగి ఉంది. ఆ ఆయింట్‌మెంట్ ఆస్పత్రికి వచ్చి మూడు నెలలు మాత్రమే అయ్యింది. దానిని రక్తగాయాలు, పుండ్ల కట్టుకు వినియోగిస్తారు. ఆస్పత్రిలో కట్టుకట్టే సిబ్బంది ఆయింట్‌మెంట్ ఎక్స్‌పైరీ తేదీ దాటిన సంగతిని గుర్తించి ఫార్మసీ స్టోర్ ఇన్‌చార్జి, వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. 'ఎక్స్‌ట్రర్నల్ యూజ్ కనుక వాడండి, ఫర్వాలేదంటూ..' వాటినే ఇస్తున్నారు. అలాగే క్లోట్రిమాజోల్ ఆయింట్‌మెంట్‌పై 2023 సంవత్సరం తేదీని వేశారు. వైద్యులకు ఇచ్చే పలు మందులు మరో నెలలో కాలం చెల్లే స్థితిలో ఉండగా, మరికొన్ని ఎక్స్‌పైర్ తేదీని దాటాయి.

ఎందుకీ పరిస్థితి?

కాలం చెల్లడానికి కేవలం నెలా, రెండు నెలలు ఉండగా సెంట్రల్ స్టోర్ నుంచి గుంతకల్లుకు మందులు వచ్చాయని తెలుస్తోంది. వాటిని ఎక్స్‌పైరీలోపే వినియోగించాల్సిన బాధ్యత వైద్యులు, ఫార్మసీ స్టాకిస్టుపై ఉంటుంది. సాధారణంగా మందుల కాలం చెల్లే తేదీ దగ్గరపడుతున్న వాటి వివరాలను తెలుపుతూ వైద్యులకు ఫార్మసిస్టులు జాబితాను ఇవ్వాల్సి ఉంటుంది. గడువు పూర్తయ్యేలోగా వాటిని వినియోగించడమో, లేదంటే సెంట్రల్ స్టోర్‌కు వాపసు పంపడమో చెయాల్సి ఉంటుంది. కాగా గతంలో ఫార్మసీకి, స్టోర్‌కు రెగ్యులర్ ఉద్యోగులు ఉండేవారు. వారిస్థానంలో ఇప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌పైరీ మందుల విషయంగా గతంలో వైద్యులకు నోట్ వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండాపోయింది. ఫార్మసీలో నిర్లక్ష్యం కారణంగా మందులు మూలన పడుతున్నాయని ఆస్పత్రి సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎక్స్‌పైరీకి దగ్గరలో మందులు వస్తున్నాయి



కొన్ని మందులు ఎక్స్‌పైరీకి అతి దగ్గరలో ఉండగా ఆస్పత్రికి వస్తున్నాయి. వాటిని సకాలంలో వినియోగించుకునేలా స్టాకిస్టు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ఎక్స్‌పైరీకి దగ్గరలో ఉన్న మందుల వివరాలను వైద్యులకు ఇచ్చి వినియోగించేలా చూడాలి. నోటి ద్వారా తీసుకునే మందులేవీ ఎక్స్‌పైరీ కాలేదు. కాలం చెల్లితే రోగులకు ఇవ్వడం లేదు. ఆయింట్‌మెంట్ల విషయంగా తప్పక చర్యలు తీసుకుంటా. సెంట్రల్ స్టోర్‌కు నివేదిక పంపి, వేరే ఆయింట్‌మెంట్లను తెప్పిస్తాం.

-జయవర్ధన్ రెడ్డి, గుంతకల్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్



ఎక్స్‌పైర్ అయిన మందు డబ్బా

శరవేగంగా విస్తరణ పనులు

హంద్రీనీవా ఎస్‌ఈ రాజాస్వరూప్‌కుమార్

ఇంటర్వ్యూ



హంద్రీనీవా విస్తరణ పనులను జూన్ ఆఖరులోగా పూర్తి చేస్తామని ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించామని, శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఈ పనులను పరిశీలించేందుకు ఈ నెల 9న సీఎం చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పనులు జరుగుతున్నాయి...?

ఎస్ఈ: హంద్రీనీవాలో ప్రస్తుతం కాలువ వెడల్పు, సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుడివైపున మాత్రమే కాలవను వెడల్పు చేస్తూవస్తున్నాం.

ప్రశ్న: లైనింగ్ పట్ల రైతుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. భూగర్భ జలాలు పెరగవని అంటున్నారు..

ఎస్ఈ: లైనింగ్ పనులతో సమస్యలు వస్తాయనేది అపోహ మాత్రమే. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌తో భూగర్భ జలాలు తగ్గిపోతాయనేది అపోహ మాత్రమే. లైనింగ్ వల్ల చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

ప్రశ్న: నిధులు ఎంత కేటాయించారు....?

ఎస్ఈ: కాలువ 144 కి.మీ. నుంచి 216వ కి.మీ. వరకు మొత్తం 72 కి.మీ. కాలువ వెడల్పునకు రూ.400 కోట్లు కేటాయించారు. 216 కి.మీ. నుంచి 200 కి.మీ. వరకు మొత్తం 184 కి.మీ. లైనింగ్ కోసం రూ.936 కోట్లు మంజూరు చేశారు.

ప్రశ్న: పనులను ఎలా చేపడుతున్నారు...?

ఎస్ఈ: కాలువ వెడల్పు పనులు ఫేజ్-1 కింద ఒక ప్యాకేజీగా విభజించారు. ఫేజ్-2 కింద 8 ప్యాకేజీలుగా విభజించారు. అన్ని పనులు చాలావేగంగా జరుగుతున్నాయి.

ప్రశ్న: కాలువ సామర్థ్యాన్ని ఎంత పెంచుతున్నారు..? పటిష్టత ఎలా ఉంటుంది..?

ఎస్ఈ: లైనింగ్, వెడల్పుతో కాలువ మరింత పటిష్టం అవుతుంది. ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చే సామర్థ్యం ఉంది. పనులు పూర్తి అయితే 3,850 క్యూసెక్కుల నీటిని మల్యాల నుంచి తీసుకురావచ్చు.

ప్రశ్న: పనులను ఎప్పటికి పూర్తి చేస్తారు...?

ఎస్ఈ: పనులు ప్రారంభించిన నాటి నుంచి వంద రోజుల్లో పూర్తి చేయాలన్నది లక్ష్యం. 20 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కాలువ వెడల్పు, లైనింగ్ పనులను నిర్దేశించిన తేదీలోగా పూర్తి చేస్తాం. వచ్చే సీజన్‌లో మల్యాల వద్ద నుంచి కృష్ణా జలాలను తీసుకువస్తాం.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్

9న ఛాయపురం రానున్న

సీఎం చంద్రబాబు

చకచకా ఏర్పాట్లు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న జేసీ

ఉరవకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9న వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. హెలీప్యాడ్ పనులు, గ్రామసభ వేదిక ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. హెలీప్యాడ్ పనులను ఆర్ అండ్‌బీ ఎస్ఈ నాగరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం గ్రామం వద్ద హెలీప్యాడ్, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గ్రామసభ వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జగదీష్‌తో కలిసి జేసీ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డీవో, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలను ఆదేశించారు. హంద్రీనీవా బ్రిడ్జి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈఈకి సూచించారు. గ్రామసభ ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కేశవనాయుడు, శ్రీనివాస్, డీపీవో నాగరాజు నాయుడు, జడ్పీసీఈవో రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజ్‌గోపాల్, డీఎల్‌డీవోలు లలితాబాయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తరతరాల సంప్రదాయం..

బండిశూల ఉత్సవం..

ఏడు కాండ్ల ఎద్దులతో రథోత్సవం

నేటి నుంచి ఐదు రోజులపాటు సంబరం



బండిశూల రథోత్సవం (ఫైల్), రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య స్వాములు



పామిడి, మే 6(ఆంధ్రజ్యోతి): బండిశూల (శూర బండి) ఉత్సవానికి జిల్లాలో ఎంతో ప్రత్యేకత ఉంది. మూడు గ్రామాలు కేంద్రంగా ఏడు కాండ్ల ఎద్దులతో ఐదు రోజులపాటు సాగే వైభోగమిది. స్వయానా దేవతలే చేయించుకుంటున్న మహోత్సవం. పామిడి మండలంలోని రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తి-అనంతపురం గ్రామాల నడుమ ఏటా వైశాఖ మాసంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. జిల్లాలోని పలు మండలాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారు.

వేడుక వెనుక విశ్వాసం

ఐదు రోజులపాటు సాగే బండిశూల ఉత్సవాలపై రామరాజుపల్లి ప్రజలు చెప్పే చరిత్ర వింటే ఆశ్చర్యం కలగక మానదు. పూర్వం రామరాజుపల్లికి చెందిన రజకులు గుత్తి-అనంతపురం వాగుకు వెళ్లి దుస్తులు ఉతుకుతూ జీవనం సాగించేవారు. ఒకరోజు గ్రామానికి చెందిన ఓ రజకుడు వాగుకు దుస్తులు ఉతికేందుకు వెళ్లగా నీరు కనిపించలేదు. దీంతో వెనుదిరిగి వస్తుండగా రెండు గాడిదలపై ఇద్దరు చిన్నారులు కూర్చుని ఉండడం గమనించాడు. ఆ చిన్నారులను ఎంత పలకరించినా పలకలేదట. దీంతో ఆ రజకుడు.. వారి చేతులు పట్టుకోగా.. వారు అదృశ్యమయ్యారు. ఇలా ఈ తంతు వారం రోజులపాటు సాగింది. ఆ చిన్నారులు గ్రామంలోని చిన్నారులతో గోళీలాట ఆడుతూ అందరినీ ఓడించి ఆట పట్టించేవారు. ఈ విషయాన్ని ఆ రజకుడు, పిల్లలు.. గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామ ప్రజలు.. రజకుడి వెంట వెళ్లారు. గ్రామ ప్రజలకు కూడా గాడిదలపై వచ్చినట్లుగా బాలలు దర్శనమిచ్చారు. ప్రజలు వారిని నిలదీయడంతో తాము దేవతలమనీ, అక్కాతమ్ముడైన సుంకులమ్మ, ముత్యాలయ్య అని తెలిపారు. తమ పేరున వైశాఖ పౌర్ణమికి ఐదు రోజులు తిరునాల జరపాలని సూచించారట. ఆ గ్రామ దేవతలు ఏడు కాండ్ల (14ఎద్దుల)తో రథాన్ని లాగించాలని తెలిపారట. ఉత్సవానికి బండిలేదని ప్రజలు తెలపడంతో ఆ బాలరూప దేవతలు.. మద్దికెర గ్రామంలోని రజక గురప్ప ఇంటి వద్ద గల బండిని తీసుకురమ్మని ఆజ్ఞాపించారట. ప్రజలు.. గురప్ప ఇంటికి వెళ్లి బండి కావాలని కోరారట. గుర్రప్ప ఆ బండిని ఇవ్వడానికి తిరస్కరించి, దేవతలను తూలనాడడంతో వారు విషయాన్ని ఆ బాల దేవతలకు తెలియజేశారట. ఆ దేవతలు బండారు (కుంకుమ, పసుపుల మిశ్రమం).. గ్రామ ప్రజలకు ఇచ్చి పంపారట. బాల దేవతలు చెప్పినట్లు ఇవ్వని పక్షంలో 'నీ సంసారం కూలుతుందని తెలియజేసినా' గుర్రప్ప తిరస్కరించడంతో వెనుదిరిగారట. వారంరోజులు తిరక్కుండానే గుర్రప్ప, ఆయన భార్య, కుమారులు మరణించడంతో గుర్రప్ప తల్లి ఆ బండిని రామరాజుపల్లి ప్రజలకు అప్పగించిందట. మద్దికెర నుంచి తెచ్చిన బండిలో చింతలచెరువు గ్రామం హంపమ్మ ఇంటి నుంచి తాటిమానును తీసుకొచ్చి సుడిబండి తయారు చేశారు. సుడిబండికి ఉన్న తాటిమానుకు వేళాడితే ఎలాంటి రోగమైనా నయమవుతుందని భక్తులు విశ్వసిస్తారు. సుడిబండికి నేతిగారెలు, నిమ్మకాయలు, పుష్పహారాలు వేలాడదీస్తారు. ఆ గ్రామ దేవతలకు రామరాజుపల్లిలో ఇళ్లే ఆలయం. గుత్తి-అనంతపురంలో ఆలయం నిర్మించారు. స్వామివార్లను చిలకమ్మ పల్లకిలో ఊరేగిస్తూ వెళుతుంటే ఏడు కాండ్ల ఎద్దులు వంతులవారీగా బండిశూల(రథం)ను లాగుతాయి. ఈ రథం మూడు గ్రామాల పొలాల మీదుగా వెళ్తుంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా రథోత్సవాన్ని మాత్రం ఆపరు. ఏయే పొలంలో వెళితే అక్కడంతా పంటలు బాగా పండుతాయని రైతులు విశ్వసిస్తారు.

ఎద్దుల కొనుగోలు

చుట్టుపక్కల గ్రామాల రైతులు బండిశూల రథోత్సవం కోసం ఎద్దులను సైతం కొనుగోలు చేస్తారు. లక్షలాది రూపాయలు వెచ్చించి, ఎద్దులు కొని వాటికి ముస్తాబు చేసి రథం(బండిశూల) లాగిస్తారు. కొందరు రైతులు మొక్కుబడి అని తెలియజేస్తున్నారు. రథోత్సవంకు కొనుగోలు చేసిన ఎద్దులతో తమ పొలాల్లో వేసవి దుక్కులు చేసుకొని తిరిగి వాటిని విక్రయిస్తుంటారు. ఏడాదిపాటు రథోత్సవంలో తమ ఎద్దులు ఎలా లాగాయో ఇతరులకు చెప్పుకుంటూ మురిసిపోతుంటారు.

బందోబస్తు నడుమ బండిశూల ఉత్సవం

గట్టి పోలీసు బందోబస్తు నడుమ బండిశూల ఉత్సవాలు నిర్వహించనున్నారు. 2014 మే 9న 132 కేవీ విద్యుత్ తీగలకు రథం తాకడంతో ఏడుగురు మృతిచెందగా.. 20 మంది గాయపడ్డారు. గతేడాది ఎన్నికల నేపథ్యంలో ఉత్సవాలు జరుగలేదు. దీంతో ఈ ఏడాది మరింత ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పోలీసుల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఆ గ్రామాల్లో దేవుళ్ల పేర్లే..

రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి-అనంతపురం గ్రామాల్లో ప్రతి ఇంటిలోనూ సుంకులమ్మ, ముత్యాలయ్య పేర్లు కలిసేలా కుటుంబ సభ్యుల పేర్లు ఉండడం విశేషం. ప్రతి ఇంటిలోనూ స్వామివారి పేర్లు మీద ఇద్దరు, ముగ్గురు ఉంటారు. గ్రామాల్లో ఒకేపేరు గల వ్యక్తులు పదుల సంఖ్యలో ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వ్యక్తితోపాటు ఇంటిపేరు చెబితేనే చిరునామా తెలుస్తుంది.

నేటి నుంచి ఉత్సవాలు

ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ బండిశూల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రామరాజుపల్లి ప్రజలు పేర్కొన్నారు. మొదటిరోజు 7న స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గంగాభవాని పూజ, సుంకులమ్మ, ముత్యాలయ్య స్వామి వార్ల ఊరేగింపు, జలధి బావి వద్ద జల పూజ, నైవేద్య కార్యక్రమం చేపడతారు. అనంతరం స్వామివారిని హంసవాహనంపై ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొస్తారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక పూజానంతరం రథానికి ఏడు కాండ్ల ఎద్దులు కట్టి లాగిస్తారు. రామరాజుపల్లి నుంచి గుత్తి-అనంతపురం వనం(వాగు) వద్ద గల దేవాలయానికి రథోత్సవం వెళ్తుంది. 8న సాయంత్రం గుత్తి-అనంతపురం వనం వద్ద దేవాలయం నుంచి రామరాజుపల్లికి రథోత్సవం ప్రారంభిస్తారు. 9న రామరాజుపల్లి నుంచి మరోసారి గుత్తి-అనంతపురంలోని వనం వద్దగల గుడికి రథం చేరుతుంది. 10న గుత్తి-అనంతపురం వనం వద్ద తిరునాళ (పరుష) నిర్వహిస్తారు. సాయంత్రం బోణాలతో నైవేద్యం సమర్పించిన తర్వాత రథం రామరాజుపల్లికి బయలుదేరుతుంది. రాత్రికి రామరాజుపల్లికి చేరుకుంటుంది. ఏయే గ్రామ పొలిమేరల వరకూ ఆయా గ్రామాల ఎద్దులు రథాన్ని లాగుతాయి. 11న స్వామి వారికి మొక్కుబడులు తీర్చుకుంటారు.




గుత్తిఅనంతపురంలో స్వామి వార్ల ఆలయం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రవీంద్రనాథ్ ఠాగూర్ (జయంతి)



దేశ జాతీయగీతం 'జనగణమన' రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ 1861 మే 7న కోల్కత్తా ప్రాంతంలో జన్మించారు. 'గురుదేవ్'గా పేరొందారు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని, శ్రీలంక జాతీయ గీతాన్ని ఆయనే రచించారు. కవి, రచయిత, నాటక రచయిత, స్వరకర్త, తత్వవేత్త, చిత్రకారుడు, సంఘ సంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 1913లో గీతాంజలి రచనకు 'నోబెల్ పురస్కారం' అందుకున్న తొలి ఆసియావాసి. నవలలు, వ్యాసాలు, చిన్నకథలు, వేలసంఖ్యలో పాటలు రాశారు. విశ్వకవి బిరుదు పొందారు. గురుకులం తరహాలో చిన్నారుల వికాసానికి శాంతినికేతన్ నెలకొల్పారు. 1941 ఆగస్టు 7న కన్నుమూశారు.

గ్రే కూపర్ (జయంతి)



అమెరికాకు చెందిన నటుడు గ్రే కూపర్ 1901 మే 7న జన్మించారు. 1925 నుంచి 1961 వరకు 84 సినిమాలలో ప్రధానపాత్రలలో పోషించారు. క్లాజికల్ హాలీవుడ్‌లో 'స్టార్ హీరో'గా పేరొందారు. ఉత్తమ నటుడిగా రెండుసార్లు అకాడమీ అవార్డు పొందగా, మూడుసార్లు నామినేట్ అయ్యారు. 23ఏళ్లపాటు వరుసగా టాప్-10 సినీ నటులలో ఒకరిగా నిలిచిన రికార్డు ఉంది. 1961 మే 13న కన్నుమూశారు.

ఆచార్య ఆత్రేయ (జయంతి)



'మనసు కవి'గా పేరొందిన ఆచార్య ఆత్రేయ 1921 మే 7న నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట మండలంలో జన్మించారు. ఆయన అసలు పేరు కిళాంబి వెంకట నరసింహా చార్యులు గొప్ప వేదాంతి. తెలుగులో నాటక, సినీ పాటల, మాటల రచయిత, నిర్మాత, దర్శకులు. దాదాపు 400 సినిమాలకు పాటలు, మాటలు రాసిన కవి. విశ్వశాంతి నాటకానికి రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. నటుడు కొంగర జగ్గయ్యకు ఆప్త మిత్రుడు. ఆత్రేయ రాసిన పాటలు, నాటకాలు, నాటికలు, కథలు మొదలగు రచనలను ఏడు సంపుటాలలో సమగ్రంగా ప్రచురించి మిత్రుడు 'జగ్గయ్య'కు గొప్ప నివాళి అర్పించారు. గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1989 సెప్టెంబరు 13న స్వర్గస్తులయ్యారు.

సేవతోనే జీవితానికి సార్థకత

హొస్పేటె, మే 6(ఆంధ్రజ్యోతి): సమాజసేవతోనే జీవితానికి సార్థకత సాధ్యమని సమాజసేవకుడు డాక్టర్ సీ జయరాజ్ అభిప్రాయడ్డారు. నగరంలోని టీజీ లే అవుట్‌లో జయరాజ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అభిమానులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దివంగతులైన వీరయోధుల కుటుంబానికి సహాయధనం అందచేశారు. దేశంకోసం ప్రాణాలు అర్పించిన వీరులను మనం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్గిల్‌యుద్ధంలో మృతి చెందిన బెళగావి శాహనగర్‌కు చెందిన భరత్‌మస్కి కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు అందచేశారు. భార్య లక్ష్మీ భరత్‌కు సాంత్వన పలికారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బణ్ణ, హడి విజయకుమార్, రాష్ట్రతిగళసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, సతీశ్‌గౌడ, రాజశేఖరగౌడ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న సమాజ సేవకుడు జయరాజ్

అభివృద్ధికి గ్రాంట్ల కొరత



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, మే 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి గ్రాంట్ల కొరత ఉందని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని కాడుగూడి, సాదరమంగల ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి భూమిపూజ చేసి మాట్లాడుతూ తమ నియోజకవర్గ అభివృద్ధికోసం బెంగళూరు నగరాభివృద్ధి శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ తగినరీతిలో గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. మహదేవపుర నియోజకవర్గంలో ఐటీబీటీ కంపెనీల వల్ల ఏటా కోట్లాదిరూపాయల పన్ను ఆదాయంగా ఉందని, కాగా గ్రామీణ ప్రాంతాలు కూడా అధికంగా ఉండడంతో ఆమేరకు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి నిధులు అవసరమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో హూడి వార్డు అధ్యక్షుడు పవన్‌రెడ్డి, కాడుగూడి వార్డు అధ్యక్షుడు మధుగౌడ, నారాయణస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో విశేష పూజలు

ముళబాగిలు, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమేశ్వర పాళ్యలో పురాణ ప్రసిద్ధమైన ప్రసన్న సోమేశ్వర దేవాలయంలో డోలోత్సవం పురస్కరించుకుని స్వామివారికి విశేషపూజలు కొనసాగాయి. పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, వేద పారాయణ, మంత్రపుష్పం, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు ఏపీ రామానాథ్ దీక్షిత్ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు సాగాయి.



అలంకరణలో సోమేశ్వరస్వామి

మాతా నేషనల్ విద్యార్థిని నమితకు వందశాతం మార్కులు

బెంగళూరు, మే 6(ఆంధ్రజ్యోతి): నాగరబావిలోని మాతా నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో నమిత 625 మార్కులకు 625 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచారు. 99.68శాతం మార్కులతో హర్షవర్ధన్ పీ మూడో ర్యాంకులోనూ, 99.52శాతం మార్కులతో నేహా నాల్గో ర్యాంకును సాధించారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడంపై పాఠశాల ప్రెసిడెంట్ హెచ్ఆర్ మల్లికార్జునయ్య హర్షం వ్యక్తం చేశారు. 90శాతం మార్కులతో 45మంది, 80 శాతం మార్కులతో 45మంది, ఫస్ట్‌క్లాస్‌లో 36మంది, సెకండ్‌క్లాస్‌లో 15మందితో కలిపి 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.



టాపర్ విద్యార్థులు

వైద్యసేవల మెరుగుకు అపోలోలో ప్రత్యేక విభాగం



ప్రముఖులతో డాక్టర్ సంగీతరెడ్డి

బెంగళూరు, మే 6(ఆంధ్రజ్యోతి): అపోలో క్రెడెల్ చిల్డ్రన్ హాస్పిటల్, అపోలో వన్ ఆల్‌లు వైద్యసేవల మెరుగుకోసం ఒక్కటిగా పనిచేయనున్నట్లు అపోలో గ్రూప్ ఆసుపత్రుల జాయింట్ ఎండీ డాక్టర్ సంగీతరెడ్డి ప్రకటించారు. మంగళవారం మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాశ్ పదుకొనె, నటి సప్తమిగౌడ, జాతీయ చలన పురస్కార గ్రహీత నటుడు రాహుల్‌దేశ్‌పాండే పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ సిటీ ఆసుపత్రిలో మహిళలు, చిన్నారులకు వైద్యసేవలు అందించేలా అత్యాధునిక సౌలభ్యాలు ఉన్నాయన్నారు. గైనకాలజిస్టులు, పెడియాట్రిషన్‌లతోపాటు ఐసీయూ, ఎన్ఐసీయూ సౌలభ్యాలతోపాటు 50 పడకలు సిద్ధమని సంగీతరెడ్డి తెలిపారు. పీడియాట్రిక్ సర్జన్‌లు, న్యూరోసర్జన్‌లు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలు ఉన్నాయన్నారు. అపోలో క్రెడెల్ మహిళల ఆరోగ్య పరీక్షల్లో ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సప్తమిగౌడ మాట్లాడుతూ నౌ ఫర్ ఫ్యూచర్ అనేలా అపోలోలో ప్రత్యేక కార్యక్రమం కొనసాగించడం ఎంతోమందికి ప్రయోజనకరం కానుందన్నారు.

కోట గోడలపై శాసనాలను కాపాడండి

చరిత్రకారుడు మైనాస్వామి



పెనుకొండ చరిత్రను తెలుపుతున్న దెబ్బతిన్న కోటగోడ

పెనుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ కోటకు అవసరమైన చోట మరమ్మతులు తక్షణం చేసి, వాటిపై చెక్కిన శాసనాలను కాపాడాలని చరిత్రకారుడు మైనాస్వామి కోరారు. కోటగోడలపైగల శాసనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలుతున్న కోటగోడలకు మరమ్మతులు చేయడమేకాక కనుమరుగవుతున్న శాసనాలను పరిరక్షించాలని పురావస్తుశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పెనుకొండ కోట నిర్మాణ విశేషాలను తెలుపుతున్న 1వ బుక్కరాయల శాసనం ఉన్న చోట కోటగోడ దెబ్బతిందన్నారు. కోట నిర్మాణ శాసనం ఉత్తర ప్రవేశ ద్వారం లోపలివైపున ఉందన్నారు. పెనుకొండ చరిత్రను తెలుపుతున్న అత్యంత ముఖ్యమైన శాసనం చెత్తకుప్పల్లో కలిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీవారు చెత్తను శాసనం ఉన్న రాయి ముందే వేస్తున్నారని, తక్షణం ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి, కంచెను ఏర్పాటు చేసి, చరిత్రను తెలిపేవిధంగా సూచిక ఫలకాన్ని అమర్చాలని కోరారు. భారత పురావస్తుశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై మూడు దశల్లో సర్వే

బంగారపేట, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కులవర్గీకరణ సమీక్ష 2025 ఇప్పటికే ప్రారంభమైందని మూడదశల్లో కొనసాగనుందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. ఎస్సీ వర్గీకరణ సర్వేకు సంబంధించి ప్రజలు తమ కులం, ఉపకులం, ఇతర సమాచారాన్ని ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. ఈనెల 17వరకు జస్టిస్ డాక్టర్ హెచ్ఎన్ నాగమోహన్ దాస్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సమీక్ష కొనసాగుతుందన్నారు. తాలూకాలో ఇంటింటికీ సర్వే కొనసాగుతోందన్నారు. ఎస్సీ జాబితాలో మొత్తం 101 ఉపకులాలు ఉన్నాయని వీటిలో ఆది కర్ణాటక, ఆదిద్రావిడ, ఆది ఆంధ్ర, బోవి, కురచ, లంబాణి ఉపకులాలు స్పష్టంగా నమోదు చేయబడ్డాయన్నారు. సమీక్షలో తొలి దశలో ఇంటింటి సర్వే కొనసాగనుండగా రెండో దశలో ఈనెల 19 నుంచి 21వరకు సర్వేలో పొర పాటున మిస్ అయినవారి నుంచి వివరాలు సేక రించనున్నారు. మూడోదశలో సెల్ఫ్ డిక్లరేషన్‌గా ఈనెల 19 నుంచి 23వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఈఓ రవికుమార్, సాంఘిక సంక్షేమ అధికారి అంజలిదేవి, బీఈఓ గురుమూర్తి, ఉపాధ్యా యులు ఆంజనేయగౌడ, నారాయణస్వామి, వెంకటేశ్‌గౌడ, ముని నారాయణప్ప, శ్రీనివాస్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లి తాలూకాలో...

బాగేపల్లి(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి తాలూకాలో ఎస్సీ కులవర్గీకరణ సర్వే ప్రారంభమైంది. తాలూకాస్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టారు. తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రి మాట్లాడుతూ మొబైల్ అప్లికేషన్ ద్వారా గణాంకాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు. కులం, ఉపకులం తదితర వివరాలను ప్రజలు తెలియచేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల విద్య, సామాజిక స్థితిగతుల గురించి సమీక్ష జరుగుతోందన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని సూచించారు.



సర్వే గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి



68వ బూత్‌లో సర్వే చేస్తున్న టీచర్ వరుణ్

ఘనంగా ఈశ్వరమ్మ డే

పుట్టపర్తి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రేమమూర్తి, ఆధ్యాత్మిక గురువు సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సమాధి రోడ్డులోని సత్యసాయి తల్లిదండ్రులు పెదవెంకమరాజు, ఈశ్వరమ్మ సమాధులను ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ దంపతులు ఈశ్వరమ్మ సమాధి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. విద్యార్థులు వేద పఠనం, భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం శ్రీసత్యసాయి గ్లోబల్ ఛైర్మన్ చక్రవర్తి, రత్నాకర్‌లు భక్తులకు నారాయణసేవ అందించారు. సాయికుల్వంతు సభామండపంలో శ్రీకాకుళం సేవాదళ్‌కు 200 కుట్టు మెషీన్లు, 100 టూల్‌కిట్లు ఆర్‌జేరత్నాకర్ పంపిణీ చేశారు. ఏపీ సేవాసంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో కిట్లను పంపిణీ చేశారు. సాయంత్రం విశ్వజనని, ఈశ్వరమ్మ పేరిట సాయియూత్ డ్యాన్స్ డ్రామాను ప్రదర్శించారు. ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువు, విద్య, వైద్య ప్రదాత సత్యసాయిబాబాకు జన్మనిచ్చిన ప్రేమమూర్తి ఈశ్వరమ్మ నాటిక ప్రదర్శించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు డిమోషన్

పుట్టపర్తిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ ప్రహ్లాదకు డిమోషన్ ఇచ్చి కదిరి మునిసిపాలిటీకి బదిలీ చేశారు. ఈమేరకు మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈయన కదిరి మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించేవారు. గత ఏడాది నవంబరులో ఉద్యోగోన్నతి కల్పించి పుట్టపర్తి మునిసిపాలిటీ కమిషనర్‌గా నియమించారు. అయితే ఈయనపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో మునిసిపల్ ఉన్నతాధికారులు ఆయనకు డిమోషన్ ఇచ్చి తిరిగి కదిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఫిట్‌నెస్ పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ తదితరులు

దొమ్మసంద్ర, మే 6(ఆంధ్రజ్యోతి): మంగళూరులో ఇటీవల నిర్వహించిన 24వ కర్ణాటక ఉశు చాంపియన్‌షిప్ టోర్నీలో కొడత గ్రామ పంచాయతీ పరిధిలోని ముళ్ళూరు గ్రామంలోని ఇండియన్‌ఫిట్‌నెట్ క్లబ్ విద్యార్థులు సత్తాచాటుకున్నారు. 6 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు సాధించారు. దొమ్మసంద్ర ధర్మసాగర హైస్కూల్ 1990-93 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కేశవ బాబురెడ్డి నేతృత్వంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కేశవబాబురెడ్డి మాట్లాడుతూ ఇటీవలకాలంలో చదువుతోపాటు ఫిట్‌నెస్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఇది చక్కటి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. తన్మయ్, విహన్‌రావ్, రిశిల్ పూజారి, హైయ్‌క్రీవ్, అకోల, తేజస్, రోహన్, జానవి, అరవింద్, భువన్, దర్శన్, పూర్ణిమాలు రాణించారన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌పోలీస్ మునిరాజు, చంద్రప్ప, విజయ్‌కుమార్, ఇండియన్ ఫిట్నుఎస్ ఫైట్‌క్లబ్ మాస్టర్ ఓంశంకర్, మధు మాస్టర్, కార్తీకశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి.. రాష్ట్ర పండుగ

● జీఓ జారీ చేసిన ఏపీ ప్రభుత్వం



పుట్టపర్తి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. సత్యసాయి శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని అసెంబ్లీలో కూటమి ప్రభుత్వాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్యులు జారీ చేసింది. ఈ ఏడాది నవంబరు 23న సత్యసాయి శత జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఇప్పటికే ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఏర్పాట్లు చేస్తున్నాయి. శత జయంతి వేడుకలకు దేశ విదేశాలకు చెందిన అనేక మంది ప్రముఖులు పుట్టపర్తికి విచ్చేయనున్నారు. పది లక్షలకుపైగా సత్యసాయి భక్తులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉంది. సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారిని కబళించిన అతిసార

● జీజీహట్టిలో ప్రబలిన మహమ్మారి ● 24 మందికి అస్వస్థత.. ఆస్పత్రుల్లో చికిత్స



అతిసారపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అతిసార బాధితులకు సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం



అమూల్య(ఫైల్)

రొళ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీజీహట్టి గ్రామంలో అతిసార వ్యాధితో అమూల్య(10) మంగళవారం మృతి చెందింది. చిన్నారి అమూల్య సోమవారం మధ్యాహ్నం నుంచి వాంతులు, విరేచనాలంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు రొళ్లలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం మంగళవారం ఉదయం శిర పట్టణంలోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా గ్రామంలో అతిసార ప్రబలడంతో 24మంది ఆస్పత్రుల పాలయ్యారు. వాంతులు, విరేచనాలు సోమవారం నుంచి అధికం కావడంతో రొళ్ల, మధుగిరి, శిర, మడకశిర ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీపీఓ సమత, డీఎల్‌పీఓ శివ నారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, తహసీల్దార్ షెక్షావలి, ఎంపీడీఓ రామారావు, వైద్యాధికారులు సౌందర్య, శివానందప్ప గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. పరిశుభ్రత, ఆహార నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య చికిత్సలు అందించారు. గ్రామస్థులు తాగునీటికి ఉపయోగిస్తున్న బోరుబావుల నుంచి శాంపిళ్లు సేకరించారు. నాలుగు రోజుల కిందట గ్రామంలో నాలుగు పెళ్లిళ్లు, గ్రామదేవత ఉత్సవం నిర్వహించారు. ఈక్రమంలోనే అతిసార సోకిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సత్వరం నివారణ చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

రొళ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీజీహట్టి గ్రామంలో అతిసార నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం ఆదేశించారు. జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ.. పది రోజులపాటు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి ప్రజలకు మెరుగైన చికిత్సను అందించాల న్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే ప్రజలకు అందించాలని సూచించారు. సత్వరమే తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించి, పైప్‌లైన్‌లలో ఎక్కడా మురుగునీరు చేరడానికి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధి అధికారితో మాట్లాడుతూ అవసరమైన మేరకు నూతన తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించి ప్రజలకు పరిశుద్ధ నీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్




హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులలో ఆయన మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో జూన్ 12నాటికి పదిలక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసే బాధ్యతను సమీక్షించాలన్నారు. జిల్లాలో 8 మండలాలు ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీఈలు శంకర్‌లాల్‌నాయక్, శ్రీనివాసు, శివాకుమార్‌నాయక్, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ: డీఆర్వో

పుట్టపర్తిటౌన్, మే6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో విజయసారథి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో డీఆర్వో మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నిర్వాహణలో భాగంగా ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.60	1,577.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1860	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	281	138
నీటి నిల్వ (టీఎంసీలు)	7.07	3.51

పోలీస్ స్టేషన్ తనిఖీ

పెనుకొండ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రొద్దం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ నర్సింగప్ప ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల పెనుకొండ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, వివరాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్‌ఐ నరేంద్రకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అదేవిధంగా కర్ణాటక సరిహద్దు ఉన్నందున తీసుకోవాల్సిన చర్యలను పోలీసులకు వివరించారు.

'అనుమానంగా కనిపిస్తే సమాచారం ఇవ్వండి'

లేపాక్షి, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కొండూరు గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి అనుమానం ఉన్న వ్యక్తుల గృహాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులకు సమావేశం నిర్వహించి ఎటువంటి గొడవలకు దిగకుండా సుఖసంతోషాలతో జీవనం సాగించాలన్నారు. భూ సమస్యలుంటే కోర్టుద్వారా పరిష్కరించుకోవాలని, గొడవలకు దిగకూడదని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ కాలనీ సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. మోడల్ కాలనీ సమీపంలో రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి ముళ్లపదల్లోకి పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా గుర్తుపట్టలేని స్థితిలో ఉందన్నారు.

27న రవాణా అదాలత్

బళ్లారి సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రాంతీయ రవాణా శాఖ ఈనెల 27న ప్రాంతీయ రవాణా అధికారుల కార్యాలయంలో రవాణా ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఏవైనా సమస్యలుంటే దరఖాస్తు ద్వారా తమ ఫిర్యాదులను పరిష్కరించుకోవచ్చు. రావాణా అదాలత్ సేవలను వినియోగించుకుని ప్రజలు తమ పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని ప్రాంతీయ రవాణా అధికారి శ్రీనివాసుగిరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విరూపాక్షేశ్వరుడి హుండీ లెక్కింపు

బళ్లారి సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): హంపి విరూపాక్షేశ్వరుడి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. మొత్తం రూ. 15.22లక్షల నగదు లభించినట్లు ఆల య అధికారుల తెలిపారు. ఆలయ గర్భగుడి ముందు ఉన్న హుండీని మార్చి 3న ఖాళీ చేయగా, దక్షిణం వైపు ఉన్న హుండిని నవంబర్ 12న ఖాళీ చేశారు. ఈరెండు హుండీల్లో నింపిన డబ్బును లెక్కించినట్లు ఆలయ నిర్వహణాధికారి హనుమంతప్ప తెలిపారు.

నదిలో స్నానానికి వెళ్లి బాలుడి మృతి



సందీప్ (ఫైల్)

సిరుగుప్ప, మే 6 (ఆంధ్రజ్యోతి): హగరి నదిలో స్నానానికి వెళ్లి బాలుడు మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ పరశురామ్ తెలిపిన వివరాల మేరకు సిరుగుప్ప తాలుకాలో ముదయనూరు, బలకుంది గ్రామాల మధ్య వున్న హగరి నదిలో సందీప్ (10) బాలుడు స్నానం చేయడానికి నది ఒడ్డున నీటిలో దిగాడు. స్నానం చేస్తూ మరికొంత లోపలికి వెళ్లడంతో నీట మునిగి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సిరుగుప్ప పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నారు.

ఇంకెన్నాళ్లో..?

- బళ్లారిలో తిష్ట వేసిన సమస్యలు
- తాగునీటి సమస్య, కాలువల శుభ్రతపై దృష్టి పెట్టని నాయకులు



వీధిదీపాలు లేని గడిగి చెన్నప్ప సర్కిల్, ప్రారంభంకాని క్లాక్‌టవర్

బళ్లారి సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి సమస్యల నగరంగా మారింది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన కొన్న సమస్యలు ఏళ్ల తరబడి పేరుకు పోయాయి. జిల్లాలో నగర ఎమ్మెల్యే, గ్రామీణ ఎమ్మెల్యే, లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, మున్సిపల్ కార్పోరేషన్‌లో దాదాపు 26మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ఆసక్తి చూపడం లేదని సామాజిక కార్యకర్త మేకల ఈశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు అధికారం కోసమే కానీ అబివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆయన అన్నారు.

వెలగని వీధిదీపాలు

బళ్లారి నగరంలో ఇందిరా గాంధీ సర్కిల్ నుంచి సరిహద్దు వరకు చెన్నప్ప సర్కిల్లో వీధి దీపాలు లేవు. రెండు సంవత్సరాలుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. విద్యుత్ దీపాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీజేపీ ప్రభత్వం హయంలో సరిహద్దులోని చన్నప్ప సర్కిల్ వద్ద ప్రారంభించిన టవర్ క్లాక్ నిర్మాణం పూర్తయ్యింది. అయితనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఇంకా ప్రారంభించలేదు. గ్రహంరోడ్డులో దాదాపు 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో కూరగాయలు , మాంసం మార్కెట్ ఉండేది. నేలను చదును చదును చేయడానికి దాదాపు రెండు సంవత్సరాలు పట్టింది. నగరంలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉంది. సరిహద్దు గ్రామాల్లో వారానికో సారి నీరు వదులుతున్నారు. నగరంలో రాజకాలువ వ్యర్థ పదార్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కేఈబీ జంక్షన్ నుంచి ప్రగతి గ్రామీణబ్యాంక్ కార్యాలయానికి దాదాపు 350 మీటర్ల పనులు పూర్తి కావడానికి సంవత్సరం కంటే అధికంగా పట్టడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన రాజకాలువ



దుమ్ము, ధూళితో కేఈబీ రోడ్డు

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

- ప్రగతి పరిశీలన సమావేశంలో అధికారులకు ఎంపీ సూచన
- గైర్హాజరైన అధికారులకు నోటీసులివ్వాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తుకారామ్

తోరణగల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు అభివృద్ధి పనులు పూర్తి కాలేదని, వాటిపై దృష్టి పెట్టాలని ఎంపీ తుకారామ్ అధకారులను ఆదేశించారు. మంగళవారం సందూరు తాలుకా నందిహళ్లి స్నాతకోత్సవ కేంద్రంలో జిల్లా అభివృద్ధి సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ తుకారామ్ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాశాఖను అభినందించారు. అలాగే గవర్నమెంట్ పాఠశాలలో పదవ తరగతిలో పాసైన వారి సంఖ్య తక్కువగా ఉందని, వారిపై దృష్టి పెట్టాలన్నారు. ఏపీఎంసీ మార్కెట్‌లో రైతులకు అనుకూలమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ నిర్మాణాలను పూర్తి చేయాలని, అన్న భాగ్య బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని సూచించారు. మట్కా, జూదం, గంజాయి మొదలగు వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. సండూరులో నీటి కొరత రాకుండా పది లక్షల లీటర్ల నీటి సేకరణకు ట్యాంకర్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా కార్యనిర్వహణాధికారి, మహమ్మద్, ఎస్పీ శోభారాణి, డీవైఎస్పీ గూగుల్, సీఐ మహేష్ గౌడ అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు, తాలుకా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

సిరుగుప్ప, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టనంలోని ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అమ్మవారికి ఆకుపూజ, కుంకుమాభిషేకం, పుష్పార్చన, అలంకార సేవలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులుతీరారు. ప్రధాన అర్చకులు శ్రీనివాస అమ్మవారికి మహామంగళహారతి చేపట్టారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

చెన్నేకొత్తపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. బియ్యం అక్రమంగా తరులుతున్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని ప్యాదిండి వద్ద నిఘా వేసి బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 57 ప్యాకెట్లు బియ్యం ఉన్నాయి. వాటిని పరిశీలించగా సబ్సిడీ బియ్యమని తేలిందని, వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సోమందేపల్లికి చెందిన మహేశ్, ధర్మవరానికి చెందిన లోకేశ్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నారన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కేంద్రం తీరుతో రాష్ట్రంపై ఆర్థిక భారం

- చిన్ననీటి పారుదల శాఖ మంత్రి భోసరాజు

రాయచూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాల వల్ల రాష్ట్రం పై 4,500 కోట్ల ఆర్థిక బారం పడిందని చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎస్.ఎస్.భోసరాజు ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న అపసవ్య విధానాల వల్ల రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని ఇబ్బందులను ప్రజలకు వివరించేందుకే బుధవారం జిల్లా కేంద్రంలో ప్రతిఘటన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన మంత్రి, కేంద్రం 45వేల కోట్ల రూపాయిల ఆదాయం లభిస్తున్నా రాష్ట్రానికి తగిన న్యాయం చేయకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి చమురు ధరలు 10 డాలర్లు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకపోవడం వల్ల గడచిన 11 ఏళ్లలో వినియోగదారుల పై రూ.37 లక్షల కోట్ల ఆర్థిక భారం పడిందన్నారు. కేంద్రం నిర్లక్ష్యం వల్ల ఆహార ధాన్యాల ధరలు 57 శాతం పెరిగాయని రాష్ట్రం నుంచి జీఎస్టీ రూపంలో రూపాయి వసూలు చేస్తున్న కేంద్రం రాష్ట్రాని మాత్రం 13 పైసలకు మించి ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఇవే విషయాలను తమ పార్టీ ప్రజలకు వివరిస్తుందన్నారు. కాగా కేంద్రం అనుసరిస్తున్న తీరును వివరించడంలో విఫలమవుతున్న బీజేపీ నాయకులు రాష్ట్రంలో మాత్రం లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తు ఆరోపణలు చేస్తున్న బీజేపీ నాయకులు కేంద్రం వల్ల రాష్ట్రానికి జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని ప్రజలకు ఎందుకు వివరించడం లేదని నిలదీశారు.ఇప్పటికైన బీజేపీ నాయకులు తమ వైఖరిని మార్చుకుని కేంద్రం నుంచి అధిక నిధులు రాష్ట్రానికి లభించేలా కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజల నుంచి మరింత వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి భోసరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సతీశ్

9 నుంచి జన ఆక్రోశ యాత్ర పునఃప్రారంభం

- హాజరుకానున్న బీజేపీ రాష్ట్ర నాయకులు: ఎమ్మెల్సీ సతీశ్

బళ్లారి సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నిర్వహిస్తున్న జనా ఆక్రోశ యాత్ర ఈ నెల 9 నుంచి తిరిగి ప్రారంబిస్తామని శాసనమండలి సభ్యుడు ఎం.సతీశ్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన నగరంలోని నటరాజ్ సినిమా హాల్ ముందు ఈనెల 9న భారీ నిరసన కార్యక్రమం చేపడ్తామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, సీటీ రవి తదితరులు నిరసనలో పాల్గొంటారన్నారు. నిరసన తర్వాత నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్ , బెంగళూరు రోడ్డు, బ్రూస్‌పేట నుంచి మోతీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేపడ్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 30న మంత్రివర్గ సమావేశంలో కుల గణన నిర్వహించాలని ప్రధాన మంత్రి మోదీ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా కార్పొరేషన్ సభ్యులు టి.శ్రీనివాస్ మోత్కార్, హనుమంతప్ప, బీజేపీ నాయకులు రామలింగప్ప, సుగుణ, ఐనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సాగుతున్న కులగణన



కులగణన నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సంజీవరాయనకోట గ్రామంలో జస్టిస్ నాగమోహన్‌దాస్ ఎంక్వైరీ కమిషన్ ఆదేశాల చేపట్టిన కుల గణన మంగళవారం సజావుగా సాగింది. గ్రామ నాయకులు, యువత నేతృత్వంలో ఎస్సీ కులాల సమగ్ర సర్వే చేపట్టామని, గణన సజావుగా సాగుతోందని ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ ఉపకులాల గణన చేపట్టామని తెలిపారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు చెన్నబసప్ప, నీలగంగమ్మ, చన్నబసమ్మ, అడివిస్వామి, అంజినమ్మ, జనాభా లెక్కల అధికారులు చన్నమ్మ, శశమ్మ, సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిమిషాంబ దేవి గంగపూజ



ఊరేగింపులో పాల్గొన్న చిత్రకార్ సమాజ సభ్యులు

కంప్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్రకార్ సమాజ సభ్యులు మంగళవారం నిమిషాంబదేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. బుధవారం నిమిషాంబ దేవి జయంత్యుత్సవం సందర్భంగా గంగపూజ చేపట్టారు. ఉదయం తుంగభద్ర నదిలో పూజలు చేపట్టారు. అనంతరం భజంత్రీలతో మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించి, ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బుధవారం సాయంత్రం పలు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించనున్నట్లు చిత్రకార్ సమాజం తాలూకా అధ్యక్షుడు మారుతి చిత్రకార్ తెలిపారు. కార్యక్రమంలో చిత్రకార్ సమాజ ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వివాహాలు పేదలకు వరం: మాజీ ఎమ్మెల్యే

సిరుగుప్ప, మే 6(ఆంధ్రజ్యోతి): ఉచిత సామూహిక వివాహాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం సిరుగుప్ప తాలుకా బలకుంది గ్రామంలో బన్ని మహంకాళి దేవి ట్రస్టు ఆధ్వర్యంలో 47 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ముఖ్య అతిథిగా పాల్గొని వివాహాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహం చేసుకున్న దంపతులు నూరేళ్ల జీవితాన్ని సుఖమయంగా జీవించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తాలుకా వ్యాప్తంగా ప్రముఖులు, ప్రజలు, బంధువులు పాల్గొన్నారు.

అదృశ్యమైన ల్యాబ్ టెక్నీషియన్..

రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం



మంజునాథ్ (ఫైల్)

రాయచూరు, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా మస్కి పట్టణానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ మృతదేహం మంగళవారం లింగసుగూరు పట్టణంలోని ఠాకూర్ లేఔట్‌లో కనిపించింది. రెండు రోజుల క్రితం ల్యాబ్ టెక్నీషియన్ మంజునాథ్(33) కనిపించడం లేదంటూ భార్య శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయన ఆచూకీ కోసం ప్రయత్నిస్తుండగా మృతదేహం లభ్యమైంది. మంజునాథ లింగసుగూరు తాలూకాలోని మెదికినాళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తుండగా రెండు రోజుల క్రితం నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నసనకోట దుర్గమ్మ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట సమీపంలో 14వతేదీ నుంచి జరగనున్న దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో ఎమ్మెల్యేపరిటాలసునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ నిమగ్నమయ్యారు. గ్రామపెద్దలు, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. 14 నుంచి 18వతేదీ వరకు ఘనంగాఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 50 ఏళ్ల తరువాత ఉత్సవాలు జరుగుతుండటంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురంరూరల్, మండలంలోని ఉప్పరపల్లిలో వెలసిన పాలవేరు వీరనాగమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం రామగిరి మండలం వెంకటాపురంలో ఉప్పరపల్లి గ్రామ పెద్దలు, టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

నార్పల, మే 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పని కల్పించాలని సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నార్పల మండల కార్యదర్శి గంగాధర్, పెద్దపెద్దయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 17పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు.

హోసూరు జోన్

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

హోసూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమనేత కార్ల్‌మార్క్స్ 207వ జయంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈశ్వరనగర్‌లో ఏర్పాటైన కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే డిల్లీబాబు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని ప్రసంగించారు. శతాబ్దాల క్రితమే ప్రత్యేక విధానాలు రూపొందించిన ఘనత కార్ల్‌మార్క్స్‌కు ఉందన్నారు. కార్మికహక్కుల కోసం నేటికీ ఆయన సూచించిన విధానాల్లో పోరుబాట కొనసాగిస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సురేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహాలింగం, నంజుండన్, నగర కార్యదర్శి నగేశ్‌బాబు, హోసూరు యూనియన్ కార్యదర్శి దేవరాజ్, నగర కమిటీ సభ్యులు, సీఐటీయూ ట్రేడ్ యూనియన్ సభ్యులు తదదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పటాలమ్మదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో పటాలమ్మ దేవి

హోసూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కెలమంగలం పట్టణంలోని పురాతన, ప్రసిద్ధ గ్రామదేవత పటాలమ్మ దేవి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. 9 గ్రామాల ప్రజలు పాల్గొని పిండి దీపాలు వెలిగించారు. అర్చకులు నాగరాజ్ నేతృత్వంలో ధార్మిక కైంకర్యాలు సాగాయి. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు నీరు, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. తళి ఎమ్మెల్యే టీ రామచంద్రన్, ఆలయ కమిటీ చైర్మన్ చన్నబసప్ప ముఖ్యులుగా పాల్గొన్నారు.

ప్రసాదంలో పాముపిల్ల

- చంద్రచూడేశ్వరుడి భక్తుల్లో కలకలం

హోసూరు, మే 6(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని చంద్రచూడేశ్వర ఆలయంలోని దుకాణంలో విక్రయించిన పులిహోర ప్రసాదంలో చనిపోయిన పాముపిల్ల కనిపించింది. దీంతో భక్తులలో కలకలం నెలకొంది. నిత్యం వెయ్యిమందికిపైగా ఆలయాన్ని సందర్శిస్తారు. సోమ, శుక్ర, శని, ఆదివారాలలో భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రదోష పూజల్లో, పౌర్ణమి రోజుల్లో భక్తుల సందడి అధికం. సోమవారం ఒక భక్తుడు కొనుగోలు చేసిన పులిహోర ప్రసాదంలో చనిపోయిన పాముపిల్లను గుర్తించి బెంబేలెత్తారు. దీనిపై ఆయన ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇతర భక్తులు దీన్ని వీడియోతీసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యింది. ప్రసాద నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రసాదంలో కనిపించిన పాముపిల్ల